క్లుప్తంగా

వైఎస్సార్ జలకళ రైతులకు వరం

ఇందుగపల్లి(వత్సవాయి): రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశ పెట్టిన వైఎస్సార్ జలకళ పథకం రైతులకు వరం లాంటిదని ఏపీవో రాఘవులు సూచించారు. ఈ పథకం ద్వారా గ్రామంలో శనివారం బోర్లకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జలకళ పథకం ద్వారా మండలంలో మొదటి విడతగా 54 బోర్లను వేసేందుకు అనుమతులు వచ్చినట్లు తెలిపారు. ప్రాధాన్యతాక్రమంలో దరఖాస్తులు అందించిన ప్రతి ఒక్కరికీ పథకం ద్వారా బోరు వేయిస్తామన్నారు. కార్యక్రమంలో ఈసీ అప్పారావు, టీఏ పవన్, ఎఫ్ఏ రామిరెడ్డి, గ్రామ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు కిలారు హనుమయ్య తదితరులు పాల్గొన్నారు.

నూతన పింఛన్ల పంపిణీ

పెద్దాపురం(వీరులపాడు): మండలంలోని పెద్దాపురం గ్రామ సచివాలయంలో వైఎస్సార్ పెన్షన్ వారోత్సవాలలో భాగంగా గ్రామానికి చెందిన లబ్ధిదారులకు మంజూరైన నూతన పెన్షన్‌లను శనివారం ఎంపీపీ కోటేరు లక్ష్మి పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ నిప్పుల పల్లి శాంతమ్మ, ఉప సర్పంచ్ బవిరిశెట్టి లక్ష్మి, పీఏసీఎస్ చైర్మన్ అవుల ప్రసాద్, మాజీ చైర్మన్ కోటేరు సత్యనారాయణ రెడ్డి, పలువురు నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

విచారణకు వచ్చిన దేవస్థాన అధికారులు

జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని శ్రీఆంజనేయ స్వామి ఆలయం, శ్రీఆనందసాయి ఆలయంలో శ్రీషిరిడి ఆనందసాయి సేవ కమిటీపై వచ్చిన ఆరోపణల విషయమై శనివారం దేవస్థాన అధికారులు విచారణ చేపట్టారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం దేవదాయ ధర్మదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ టి.అన్నపూర్ణ జగ్గయ్యపేట పట్టణానికి వచ్చి సదరు ఆలయాల కమిటీ సభ్యులను విచారించారు. నందిగామ డివిజన్ ఎండోమెంట్స్ ఇన్‌స్పెక్టర్ అనురాధ, దేవాలయ ఈవో నాగరాజు పాల్గొన్నారు.

ట్రాఫిక్ సమస్యలు సృష్టించే వారిపై కఠిన చర్యలు



నందిగామ: ట్రాఫిక్ సమస్యలు సృష్టించే వారిని ఉపేక్షించబోమని ఎస్‌హెచ్‌ఓ సతీష్ హెచ్చరించారు. పట్టణంలోని మెయిన్ బజారు, రైతు పేట, రామన్నపేట రోడ్డుతో పాటు పలు ప్రధాన వీధుల్లో శనివారం రాత్రి సిబ్బందితో కలసి ఆయన కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వాహనాలు అడ్డదిడ్డంగా నిలిపే వారు, రహదారులను ఆక్రమించి వ్యాపారాలు నిర్వహించే వారిపై కఠిన చర్యలుంటాయన్నారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చూసే క్రమంలో పోలీసులకు సహకరించాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్‌ఐలు పండుదొర, సురేష్, సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుద్ధ్య మెరుగుదలకు ప్రాధాన్యం

నందిగామ: పట్టణంలో పారిశుద్ధ్య మెరుగుదలకు పెద్ద పీట వేస్తున్నట్లు నగర పంచాయతీ కమిషనర్ జయరాం తెలిపారు. పట్టణంలోని 13వ వార్డులో శనివారం ఉదయం ఆయన పర్యటించి పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకుడు రమేష్, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

శ్రీ చైతన్య పాఠశాలలో ముందస్తు సంక్రాంతి సంబరాలు



నందిగామ:సంప్రదాయ పండుగలను ప్రతి ఒక్కరూ జరుపుకోవాలని శ్రీ చైతన్య పాఠశాల డీన్ రవికుమార్ సూచించారు. స్థానిక పాఠశాల ఆవరణలో శనివారం ముందస్తు సంక్రాంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థినీ విద్యార్థులకు పలు రకాల పోటీలు నిర్వహించారు. వీటిలో వాలుజడ పోటీ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. రంగవల్లుల పోటీలు సందడిగా సాగాయి. అనంతరం భోగి మంటలు వేయడంతో పాటు చిన్నారులను భోగి పండ్లతో దీవించారు. ఈ సందర్భంగా పండుగ విశిష్టతను విద్యార్థులకు వివరించారు. చివరలో ఆయా పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి బహుమతులు అందజేశారు. వేడుకల్లో భాగంగా చిన్నారులు పలు రకాల వేషధారణల్లో అలరించారు.

అమ్రితసాయిలో ప్రాంగణ ఎంపికలు

కంచికచర్ల: మండలంలోని పరిటాల అమ్రితసాయి ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు 24 మంది ప్రాంగణ ఎంపికలలో ఉద్యోగాలకు ఎంపికైనట్టు శనివారం కళాశాల కరస్పాండెంట్ అండ్ సెక్రటరీ కె.రామ్మోహన్‌రావు తెలిపారు. ఈ సందర్భంగా కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ఎంపికైన విద్యార్థులను ఆయనతో పాటు ప్రిన్సిపాల్, ప్లేస్‌మెంట్ అధికారి, అధ్యాపకులు అభినందించారు.

ఫోర్‌లైన్ చకచకా...

- రూ.14 కోట్లతో శరవేగంగా రహదారి నిర్మాణం
- పేట–చిల్లకల్లు వాసుల చిరకాల స్వప్నం సాకారం
- భవిష్యత్తులో జంట పట్టణాలుగా రూపుదాల్చే అవకాశం



శరవేగంగా జరుగుతున్న పేట–చిల్లకల్లు ఫోర్‌లైన్ రోడ్డు నిర్మాణ పనులు

జగ్గయ్యపేట–చిల్లకల్లు డబుల్ రోడ్డు నిర్మాణంతో జగ్గయ్యపేట పట్టణం, చిల్లకల్లు గ్రామాల ప్రజల చిరకాల స్వప్నం సాకారం కానుంది. రూ.14 కోట్లతో చేపట్టిన ఈ ఫోర్ లైన్ రోడ్డు నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. నియోజకవర్గ కేంద్రంగా ఉన్న జగ్గయ్యపేట పట్టణం మున్సిపాలిటీ కాగా, చిల్లకల్లు మండల కేంద్రంగా ఉంది. మండల పరిషత్ కార్యాలయంతో పాటు మండల రూరల్ పోలీస్‌స్టేషన్ కూడా చిల్లకల్లు లోనే కొనసాగుతున్నాయి. ఈ రెండూ భవిష్యత్‌లో జంట పట్టణాలుగా మారనున్న నేపథ్యంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను మండల కేంద్రంగా ఉన్న చిల్లకల్లును అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక ప్రణాళికను రూపొందించారు.

జగ్గయ్యపేట అర్బన్: చిల్లకల్లు గ్రామం జగ్గయ్యపేట పట్టణం నుంచి 5 కి.మీ దూరంలో, 65 వ నంబర్ జాతీయ రహదారిపై ఉంది. జగ్గయ్యపేట పట్టణాన్ని నందిగామ, కోదాడ పట్టణాల మాదిరిగా జాతీయ రహదారిపై ఉండేలా విస్తరించాలనే సంకల్పంతో ఎమ్మెల్యే ఉదయభాను ఆ దిశగా ప్రయత్నాలు ప్రారంభించారు. అందులో భాగంగా ముందుగా చిల్లకల్లు గ్రామాన్ని అభివృద్ధి చేయాలనే సంకల్పంతో చిల్లకల్లు–జగ్గయ్యపేటకు మధ్య ఇరుకుగా ఉన్న రహదారిని సువిశాలమైన రహదారిగా రూపొందించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో జగ్గయ్యపేట నుంచి చిల్లకల్లుకు 5 కి.మీ మేర ఫోర్‌లైన్ రోడ్డు నిర్మాణానికి శ్రీకారం చుట్టారు.

రూ.14 కోట్లతో 4 లైన్ల సీసీ రోడ్డు నిర్మాణం

65 వ నంబరు జాతీయ రహదారి నుంచి జగ్గయ్యపేటకు వెళ్లే రహదారి నిత్యం వాహనాల రాకపోకలతో రద్దీగా ఉంటుంది. అంతేకాక జగ్గయ్యపేట పరిసరాలలో సిమెంట్ తదితర పలు కర్మాగారాలు ఉండటంతో హైదరాబాద్–విజయవాడకు నిత్యం సరుకు రవాణాకు సంబంధించి లారీలు, ఇతర వాహనాల రాకపోకలు సాగిస్తుంటాయి. గతంలో ఉన్న సింగిల్ వే రోడ్డు ఇరుకుగా ఉండి తరచూ రోడ్డు ప్రమాదాలు జరగటం, ట్రాఫిక్ నిలిచిపోవడం వంటి సంఘటనలు జరుగుతుండటంతో రహదారి విస్తరణ అనివార్యం అయింది. ఎమ్మెల్యే ఉదయభాను కృషితో 4 లైన్ల రహదారి నిర్మాణానికి గాను రూ.14 కోట్లు మంజూరయ్యాయి. పేట పట్టణంలోని వైఎస్సార్ సర్కిల్ నుంచి చిల్లకల్లులోని పంచాయతీ కార్యాలయం వరకు 5 కి.మీ మేర చేపట్టిన నిర్మాణ పనులకు గత అక్టోబర్ 31 న రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాని గోవర్ధనరెడ్డి, ఏపీ రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ(శాప్) చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభానుతో కలిసి శంకుస్థాపన చేశారు.

నగరాల్లో ఉండే విధంగా 12.5 మీటర్ల స్పన్ కరెంట్ స్తంభాలు

పట్టణ సుందరీకరణలో భాగంగా పెద్ద పట్టణాలలో ఉండే కార్పొరేట్ స్థాయి 12.5 మీటర్ల ఎత్తైన విద్యుత్ స్పన్ పోల్స్‌ను చిల్లకల్లు–జగ్గయ్యపేట పట్టణాలకు మధ్య ఏర్పాటుచేస్తున్నారు. ఈ తరహా స్తంభాలు విజయవాడ నుంచి ఇవతల ఎక్కడా లేవు. సుమారు రూ.50 లక్షల వ్యయంతో 20 పోల్స్, లైన్‌ను ఏర్పాటు చేస్తున్నారు. ఇవి కూడా పేట పట్టణ శివారు వరకు పూర్తయ్యాయి. ఇంకా చిల్లకల్లు వైపు ఏర్పాటుచేయాల్సి ఉంది. వచ్చే మే నెల నాటికి ఈ రోడ్డు నిర్మాణాన్ని పూర్తి చేసి ప్రారంభోత్సవం చేయాల్సి ఉండటంతో ఇంజినీరింగ్ అధికారులు, కంట్రాక్టర్లు కృషి చేస్తున్నారు.

మాకు ట్రాఫిక్ బాధలు తప్పాయి



జగ్గయ్యపేట–చిల్లకల్లుకు మధ్య 4 లైన్ల రోడ్డు మంజూరు చేసినందుకు ఎమ్మెల్యే సామినేని ఉదయభాను, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ధన్యవాదాలు తెలియజేస్తున్నా. ఫోర్ లైన్ రోడ్డు పూర్తయితే మాకు ట్రాఫిక్ బాధ తప్పుతుంది.

–మాతంగి కెనడీ, ఆటో డ్రైవర్, బలుసుపాడు

పేట–చిల్లకల్లు వాసుల చిరకాల వాంఛ తీరనుంది



కొన్ని దశాబ్దాలుగా జగ్గయ్యపేట, చిల్లకల్లు వాసులను పట్టి పీడిస్తున్న ట్రాఫిక్, రోడ్డు ప్రమాదాల సమస్యకు చెక్ పెట్టాలనే ఉద్దేశంతోనే ఈ ఫోర్ లైన్ రోడ్డు నిర్మాణం చేపట్టాం. అందుకు అడిగిన వెంటనే నిధులు మంజూరు చేసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నా. పేట పట్టణాన్ని జాతీయ రహదారిపైకి విస్తరింపజేయాలనే సంకల్పంతో ఇప్పటికే హైవే బస్టాండ్ నిర్మాణం, ఊర చెరువు అభివృద్ధి, మినీ పార్కులు, వాటర్ ఫౌంటెయిన్లు, బౌద్ధ క్షేత్రం వంటి నిర్మాణాలు చేపట్టాం. భవిష్యత్‌లో పేట పట్టణాన్ని ప్రముఖ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ముందుకు పోతున్నాం.

–సామినేని ఉదయభాను, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే, జగ్గయ్యపేట

కోడి పందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న తహసీల్దార్

జగ్గయ్యపేట: సంక్రాంతి పండుగ సందర్భంగా మండలంలో కోడి పందేలు, జూదం వంటి ఆటలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ నాగేశ్వరరావు హెచ్చరించారు. పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ, పోలీస్, పంచాయతీ, పశు సంవర్ధక శాఖ అధికారులతో శనివారం ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలో అనుమంచిపల్లి, వేదాద్రి, చిల్లకల్లు, తిరుమలగిరి, బూదవాడ, ముక్త్యాల గ్రామాల్లో కోడి పందేల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నట్లు సమాచారం వచ్చిందన్నారు. అటువంటి ఆలోచనలు ఉంటే మానుకోవాలని హెచ్చరించారు. అసాంఘిక క్రీడల నియంత్రణకు గ్రామాల వారీగా ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామన్నారు. అనంతరం కోడి పందేలు నిర్వహించవద్దనే వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. సమావేశంలో ఎంపీడీవో జయచంద్ర, ఎస్‌ఐలు రామారావు, చిన్నబాబు, పశువైద్యాధికారి ప్రవంతి, ఆయా గ్రామాల వీఆర్వోలు పాల్గొన్నారు.

పేకాట శిబిరంపై పోలీసుల దాడి

తాటిగుమ్మి(వీరులపాడు): కోడిపందేలు, పేకాట శిబిరాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ సోమేశ్వరరావు హెచ్చరించారు. మండలంలోని తాటిగుమ్మి గ్రామ శివారులో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై శనివారం ఆయన తన సిబ్బందితో దాడి చేశారు. ఈ దాడిలో ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.వెయ్యి నగదు స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన వారిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్నాం

ఎమ్మెల్యే డాక్టర్ జగన్‌మోహనరావు



కొత్తగా మంజూరైన లబ్ధిదారులకు పింఛన్ నగదు అందజేస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

కంచికచర్ల: ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృతనిశ్చయంతో పాలన సాగిస్తున్నారని అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నారని ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహన్‌రావు అన్నారు. కంచికచర్ల మండల పరిషత్ కార్యాలయంలో కొత్తగా మంజూరైన 290 పింఛన్లను శనివారం ఆయన లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా పెద్ద మొత్తంలో పింఛన్ నగదు ఇస్తున్న ఏకైక రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అన్నారు. టీడీపీ నాయకుడు చంద్రబాబు అడ్డదారిలోనైనా అధికారంలోకి రావాలని చూస్తున్నారని, ఇరుకు సందుల్లో ప్రచారం పేరుతో సభలు పెట్టి ప్రజలను బలి తీసుకుంటున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక ఇష్టమొచ్చినట్లు మాట్లాడుతున్నారని ఇప్పటికైనా వారు ప్రభుత్వంపై బురద జల్లే కార్యక్రమం మానుకోవాలని లేకపోతే ప్రజలే తగిన బుద్ధి చెబుతారని అన్నారు. అనంతరం కొత్తగా మంజూరైన పింఛన్లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ షేక్ మలక్‌బషీర్, జెడ్పీటీసీ సభ్యురాలు వేల్పుల ప్రశాంతి, వైస్ ఎంపీపీలు బండి మల్లికార్జునరావు, వెలగలేటి మాధవి, సర్పంచి వేల్పుల సునీత, మాజీ ఎంపీపీ పాటిబండ్ల హరిజగన్నాధరావు, ఎంపీటీసీ సభ్యులు నన్నపనేని నరసింహారావు, మాడుగుల మధుబాబు, పిల్లి భాగ్యలక్ష్మి, వేమా సురేష్‌బాబు, వేమా రోజారమణి, గుదే సరస్వతి, పాపట్ల సీత, నాయకులు వేల్పుల రమేష్, శ్రీనివాసరావు, రాయల నరసింహారావు, మార్త శ్రీనివాసరావు, బుడ్డి సత్యనారాయణ ఎంపీడీఓ బాల శంకరరావు, తహసీల్దార్ రాజకుమారి పాల్గొన్నారు.

బాల్యవివాహాలపై అవగాహన

కొణకంచి(పెనుగంచిప్రోలు):బాల్య వివాహాలు చేయటం చట్టరీత్యా నేరమని వైద్యాధికారి కె.వాణి తెలిపారు. స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో శనివారం ప్రభుత్వ ఆయుర్వేద ఆసుపత్రి ఆధ్వర్యంలో విద్యార్థులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిన్న వయస్సులో పెళ్లిళ్లు చేసుకోవటం వలన కలిగే అనర్థాలను వివరించారు.రక్తహీనత కలగకుండా తీసుకోవాల్సిన పౌష్టికాహారాన్ని గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో 104 వైద్యాధికారి రవితేజ, ఏఎన్ఎం, ఆశ వర్కర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రహదారి వెంబడి ఆక్రమణల తొలగింపు



రహదారి పక్కనున్న ఆక్రమణలు తొలగిస్తున్న అధికారులు

చిల్లకల్లు(జగ్గయ్యపేట): గ్రామం నుంచి జగ్గయ్యపేటకు రూ.14 కోట్ల వ్యయంతో చేపడుతున్న రోడ్ల విస్తరణలో భాగంగా రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఆక్రమణలను శనివారం అధికారులు తొలగించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయం నుంచి రోడ్డుకు ఇరుపక్కలా ఉన్న ఆక్రమణలను రెవెన్యూ, ఆర్అండ్‌బీ, పంచాయతీ రాజ్ శాఖాధికారులు పొక్లెయినర్‌తో తొలగించారు. రహదారి అబివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నరసింహారావు, వీఆర్వో శ్రీనివాసరావు, ఆర్అండ్‌బీ ఇన్‌స్పెక్టర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

శుభార్జునకు అభినందన



శుభార్జునను అభినందిస్తున్న సీఐ కాత్యాయిని, కళాశాల ప్రిన్సిపాల్స్

కంచికచర్ల: పరిటాల ఎంవీఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో పాలిటెక్నిక్ విద్యార్థి కార్యంశెట్టి శుభార్జున్ జిల్లా స్థాయిలో టేబుల్ టెన్నిస్ విభాగంలో ప్రతిభ కనపర్చి బహుమతి సాధించాడు. ఈ సందర్భంగా శనివారం కళాశాలలో శుభార్జునను కళాశాల ప్రిన్సిపాల్స్ ఏడుకొండలు, సుధాకర్, సెబ్ సీఐ కాత్యాయని, కళాశాల అధ్యాపకులు అభినందించారు.

ఫ్యాక్టరీ తొలగించాలని గ్రామస్తుల ఆందోళన



ఫ్యాక్టరీ ఎదుట జన జాగరణ చేస్తున్న గ్రామస్తులు

షేర్‌మహ్మద్‌పేట(జగ్గయ్యపేట): గ్రామ సమీపంలోని గ్రీన్‌టెక్ కెమికల్ ఫ్యాక్టరీని తొలగించాలని శుక్రవారం అర్ధరాత్రి ప్రజా సంఘాల ఆధ్వర్యంలో గ్రామస్తులు, యువకులు ఫ్యాక్టరీ వద్ద జనజాగరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఫ్యాక్టరీ నుంచి నిత్యం రసాయన కాలుష్యం వెలువడుతోందని, ప్రజలతో పాటు సమీపంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు కూడా ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. రాత్రి వేళల్లో గాలిలోకి కాలుష్యం వస్తుండటంతో రామచంద్రునిపేట, అనుమంచిపల్లి గ్రామాల ప్రజలు కూడా అనారోగ్యం బారిన పడుతున్నారన్నారు. గత మూడేళ్లుగా ఫ్యాక్టరీ తొలగించాలని అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవటం లేదన్నారు. విషయం తెలుసుకున్న సీఐ నాగమురళి ఫోన్‌లో చర్చలు జరిపి జిల్లా అధికారులకు సమాచారం అందిస్తామని చెప్పటంతో ఆందోళన విరమించారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు నాగమణి, లింగారావు, వెంకటేశ్వర్లు, జాని, లింగరాజు, ఇస్మాయిల్, గౌసమియా, తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



నందిగామలో సీఎంఆర్‌ఎఫ్ చెక్కు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

నందిగామ టౌన్: నిరుపేదలపై వైద్య ఖర్చుల భారం పడకుండా వారిని ఆదుకునేందుకే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఆర్థిక సహకారం అందిస్తున్నారని శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్ మోహనరావు అన్నారు. రూ.1.88 లక్షల విలువైన చెక్కులను శనివారం ఆయన లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జగన్‌మోహనరావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయ నిధి పేద ప్రజలకు భరోసా కల్పిస్తుందన్నారు. పట్టణానికి చెందిన దాసరి గోపాలకృష్ణకు రూ.1.40 లక్షలు, కంచికచర్ల మండలం మోగులూరు గ్రామానికి చెందిన యర్రగుంట కోటేశ్వరరావుకు రూ.28 వేలు, వీరులపాడు మండలం దొడ్డదేవరపాడు గ్రామానికి చెందిన పొందుగుల తేజస్వినికి రూ.20 వేలు మంజూరయ్యాయని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జయరాం, నాయకులు కర్రి రవీంద్ర బాబు, తానూరి రాము, బండి మల్లికార్జునరావు, తోట నారాయణరావు పాల్గొన్నారు.

మిర్చి తోటలను పరిశీలించిన శాస్త్రవేత్తలు



మిర్చి తోటలను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తల బృందం

వత్సవాయి: మండల కేంద్రం వత్సవాయిలోని మిర్చి తోటలను బెంగళూరుకు చెందిన శాస్త్రవేత్తలు శనివారం పరిశీలించారు. బెంగళూరుకు చెందిన ఐసీఏఆర్–ఎన్‌బీఏఐఆర్‌కు చెందిన సీనియర్ సైంటిస్టు సునీవ్ ఆదేశాల మేరకు శాస్త్రవేత్తలు కె.శ్రీదేవి, కందన్, రచన, వి.శ్రీధర్, వెంకటరమణ, ఆచార్య ఎన్‌జీరంగా విశ్వవిద్యాలయం శాస్త్రవేత్త ఎం.విశాలాక్షి, వైఎస్సార్ ఉద్యాన విశ్వ విద్యాలయం శాస్త్రవేత్త కె.శిరీష తోటలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వాతావరణంలో ఏర్పడిన పరిస్థితుల వల్ల మిర్చి తోటలకు నల్లతామర పురుగు వ్యాపించిందని తెలిపారు. వీటి ఉధృతిని తగ్గించుకోవడానికి పిప్రోనిల్, బ్రోప్లానిలైడ్ పిచికారీ చేసుకోవాలని సూచించారు. రైతులు ఎప్పటికప్పుడు పంటను పరిశీలించుకుంటూ మందును పిచికారీ చేయించుకోవాలన్నారు. పంట వేసిన పొలం గట్ల వెంబడి పిచ్చిమొక్కలు, గడ్డి లేకుండా ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉండేలా చూసుకోవాలన్నారు. మిర్చి తోటల్లో అక్కడక్కడా బంతి మొక్కలను కూడా నాటుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉద్యానశాఖాధికారి బాలాజీ, జగ్గయ్యపేట ఏడీఏ శ్రీనివాసరావు, మండల వ్యవసాయాధికారి వి.రవికుమార్, ఉద్యానశాఖాధికారి వర్షినీకుమారి తదితరులు పాల్గొన్నారు.

జగనన్న కాలనీల్లో మెరుగైన వసతులు



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ జయరాం

నందిగామ: ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను, మౌలిక వసతులను సద్వినియోగం చేసుకుంటూ లబ్ధిదారులు శరవేగంగా ఇళ్ల నిర్మాణాలు చేపట్టాలని నగర పంచాయతీ కమిషనర్ జయరాం సూచించారు. పట్టణ శివారుల్లోని అనాసాగరం, హనుమంతుపాలెం, మండల పరిధిలోని మునగచర్ల గ్రామ పరిధిలో ఏర్పాటుచేసిన జగనన్న కాలనీల లబ్ధిదారులతో ఆయా కాలనీల వద్ద శనివారం ప్రత్యేక సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ గృహ నిర్మాణ లబ్ధిదారుల కోసం ప్రభుత్వం అనేక సదుపాయాలు కల్పిస్తోందని, వాటిని సద్వినియోగం చేసుకుంటూ, ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేసుకుని, సొంతింటి కల నెరవేర్చుకోవాలన్నారు. లే అవుట్లలో 40 శాతం గృహ నిర్మాణాలు చేపడితే, మరింత మెరుగైన మౌలిక వసతులు సమకూర్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. కార్యక్రమంలో లబ్ధిదారులు, గృహ నిర్మాణ శాఖాధికారులు, సచివాలయ, మెప్మా ఉద్యోగులు పాల్గొన్నారు.

పేటను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యం

ప్రభుత్వ విప్ ఉదయభాను



ఊర చెరువును పరిశీలిస్తున్న ప్రభుత్వ విప్ ఉదయభాను, మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర

జగ్గయ్యపేట అర్బన్: పర్యాటకులను ఆకట్టుకునే విధంగా అన్ని హంగులను ఏర్పాటుచేసి జగ్గయ్యపేట పట్టణాన్ని ప్రముఖ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ముందుకు పోతున్నట్లు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను తెలిపారు. స్థానిక ఊర చెరువును ఆయన ఆర్కిటెక్చర్ రమేష్, మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర తదితరులతో కలిసి శనివారం పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ పట్టణమంతా గ్రీనరీ, పలు చోట్ల వాటర్ ఫౌంటెయిన్లు, మినీ పార్కులు ఏర్పాటుచేసి పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు. ఊర చెరువు చుట్టూ వాకింగ్ ట్రాక్ నిర్మాణం, గ్రీనరీ, లైటింగ్, బోటు షికారు వంటి సౌకర్యాలను ఏర్పాటుచేసి హైదరాబాద్‌లోని ట్యాంక్ బండ్, ఖమ్మంలోని లకారం మాదిరిగా చెరువును అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. తద్వారా ఖర్చుకు ఏమాత్రం వెనుకాడకుండా అభివృద్ధి పనులు చేపట్టి పట్టణాన్ని పెద్ద పర్యాటక కేంద్రంగా అభివృద్ధి పరచనున్నట్లు తెలిపారు. ఊర చెరువు అభివృద్ధికి సంబంధించిన డిజైన్ పనులను ఆర్కిటెక్చర్‌కు అప్పగించినట్లు తెలిపారు. వారు త్వరలో డిజైన్ అందజేయగానే పనులు మొదలవుతాయన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్, కౌన్సిలర్ తన్నీరు నాగమణి నాగేంద్రం, పఠాన్ ఫిరోజ్‌ఖాన్ తదితర నాయకులతో పాటు మున్సిపల్ కమిషనర్ శివకోటేశ్వర రావు, ఏఈ హనుమంతరావు పాల్గొన్నారు.

జగన్ ప్రభుత్వంలో రెండు కళ్లుగా సంక్షేమం, అభివృద్ధి

ఎమ్మెల్యే డాక్టర్ జగన్‌మోహనరావు



ప్రభుత్వ పథకాలకు సంబంధించిన పత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

కంచికచర్ల: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా పాలన చేస్తున్నారని శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు అన్నారు. మండల కేంద్రమైన కంచికచర్ల గ్రామ సచివాలయం–1లోని 8 వార్డులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం శనివారం నాల్గవరోజు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సచివాలయ, వలంటీర్ల వ్యవస్థలను అందుబాటులోకి తీసుకువచ్చి ప్రజలకు పాలనను అత్యంత చేరువ చేసిన దార్శనికుడు సీఎం జగన్ అని, అనేక రాష్ట్రాలు ఈ వ్యవస్థలను వారి రాష్ట్రాల్లో కూడా అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాయని తెలిపారు. సంక్షేమ పథకాలను రాజకీయాలకతీతంగా అమలు చేస్తూ, అర్హతే ప్రామాణికంగా లబ్ధిదారులను గుర్తించి లబ్ధి చేకూర్చుతున్న ఘనత మన ప్రభుత్వానికే దక్కుతుందని అన్నారు. రానున్న కాలంలో రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి చెందేందుకు సీఎం జగన్ అనేక సంస్కరణలు తీసుకువస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ షేక్ మలక్‌బషీర్, జెడ్పీటీసీ సభ్యురాలు వేల్పుల ప్రశాంతి, వైస్ ఎంపీపీ బండి మల్లికార్జునరావు, సర్పంచి వేల్పుల సునీత, వైఎస్సార్‌సీపీ మండల, పట్టణ కన్వీనర్లు నన్నపనేని నరసింహారావు, వేమా సురేష్‌బాబు, నాయకులు నంబూరు పెదబాబు, నారిశెట్టి శ్రీనివాసరావు, దేవరకొండ గురవయ్య, వంగా శ్రీనివాసరావు, దాసరి రాము, మాగుడుల శంకర్, వేల్పుల శ్రీనివాసరావు, వేల్పుల రమేష్, చలమల ప్రభాకర్, కోయ సుబ్రహ్మణ్యం, అధికారులు, గ్రామ సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

వ్యవసాయానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం



బోరు పంపు పనుల ప్రారంభంలో పాల్గొన్న సర్పంచ్ జ్యోతి తదితరులు

అనిగండ్లపాడు(పెనుగంచిప్రోలు): వ్యవసాయానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని సర్పంచ్ బి.జ్యోతిబ్రహ్మం తెలిపారు. గ్రామంలో శనివారం వైఎస్సార్ జలకళ పథకంలో భాగంగా మంజూరైన రైతుల పొలాల్లో బోరు పంపు ఏర్పాటు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతు శ్రేయస్సే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అనేక పథకాలు అమలు చేస్తున్నారన్నారు. రైతులు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు గింజుపల్లి శ్రీనివాసరావు, దోసపాటి దానయ్య, నరసింహారావు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.